సెప్టెంబర్ 7న వికలాంగుల సదస్సు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మేడ్చల్: మేడ్చల్‌లో సెప్టెంబర్ 7న వికలాంగుల, చేయూత పింఛన్ దారుల సన్నాహక సదస్సు నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి లక్ష్మణ్‌మాదిగ తెలిపారు. మేడ్చల్ నాయకులతో కలిసి శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వికలాంగులు, పింఛన్‌దారుల కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నామని దానికి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని వికలాంగులు, పింఛన్ దారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పరశురాం మాదిగ, ఎన్వై అశోక్, రాంచందర్, ప్రణయ్, అరుణ్, శివ, బాలనర్సింహ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్‌సీఈలో సదస్సు



సదస్సులో కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ అశోక్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ–2020) సదస్సును శుక్రవారం నిర్వహించారు. జాతీయ విద్యావిధానం అమల్లోకి వచ్చి ఐదేళ్లు గడిచిన సందర్భంగా ఆత్మ విమర్శ, విజయాలు, ముందున్న దారి అనే అంశంతో నిర్వహించిన సదస్సులో హైదరాబాద్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ హాజరై ఆయా అంశాలపై చర్చించడంతో పాటు విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



జవహర్‌నగర్: కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వసంత కార్మికులకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో కార్మికుల ఆరోగ్య భద్రతతో పాటు, రక్షణ కవచాలను అందచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నరేశ్‌బాబు, ఆర్‌ఓ వెంకటేశ్, కృష్ణప్ప, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పీఎస్‌ను తనిఖీ చేసిన సీపీ



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

ఘట్‌కేసర్: రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, సిబ్బంది హాజరు పట్టిక, క్రైం వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఎస్సై ప్రభాకర్‌రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్ రావు

ఘట్‌కేసర్: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల (కేసీఆర్‌ఐటీ)లో మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన ఓరియంటేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యక్తిగత నైపుణ్యం పెంపొందించుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల చైర్మన్ కొమ్మూరి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. కళాశాలలో విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇస్తామన్నారు. గౌరవ అతిథి క్యాప్‌జెమినీ డైరెక్టర్ రాధిక గజేంద్ర మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణతో పరిశ్రమలో సమర్థులుగా తయారు కావాలని సూచించారు. కార్యక్రమంలో గవర్నింగ్ బాడీ మెంబర్ డాక్టర్ జీవీకే రెడ్డి, డైరెక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్, స్ట్రాటజీ డైరెక్టర్ దివ్యశ్రీ, ప్రిన్సిపాల్ శ్రీనాథ్ కశ్యప్, విద్యార్థులు, తల్లితండ్రులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐటీ పార్కుల విస్తరణ దిశగా..

శివారుల్లో అభివృద్ధిపై సర్కారు ప్రత్యేక ఫోకస్ | ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాటుకు చర్యలు | ప్రభుత్వ, అసైన్డ్ భూముల గుర్తింపునకు ఆదేశం | కసరత్తు చేస్తోన్న రెవెన్యూ శాఖ యంత్రాంగం



సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లో ఐటీ రంగం విస్తరణ.. పారిశ్రామిక అభివృద్ధిపై సర్కారు దృష్టి సారిస్తోంది. పరిశ్రమల ఏర్పాటుతో వందలాది మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా.. వేలాది కుటుంబాలకు పరోక్షంగా ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతోంది. హైదరాబాద్‌–వరంగల్ పారిశ్రామిక కారిడార్‌తో పాటు నగరం నలువైపులా ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. గ్రిడ్ పాలసీలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉప్పల్ జెన్‌ప్యాక్ వద్ద 20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ పార్కుతో సహా నగరానికి ఉత్తరాన కండ్లకోయలో గేట్‌వే ఐటీ పార్కుకు శంకుస్థాపన చేసింది. వీటి విస్తరణ దిశగా వేగవంతం చేయడంతో పాటు నగరానికి తూర్పు దిశలో ఘట్‌కేసర్ మండలం మాదారంలో 285 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు కాంగ్రెస్ సర్కారు చర్యలు చేపడుతోంది.

ప్రపంచస్థాయి ప్రమాణాలతో..

ప్రపంచస్థాయి ప్రమాణాలతో పారిశ్రామిక పార్కులను తీర్చిదిద్దాలని యోచిస్తున్న ప్రభుత్వం ఆ దిశగా జాతీయ రహదారులకిరువైపులా ప్రభుత్వ భూములను గుర్తించడంతో పాటు రోడ్లు, రైల్వే సౌకర్యం, నీటి సరఫరా, స్థానికులకు ఉద్యోగావకాశాలను పరిగణనలోనికి తీసుకోవాలని అధికార యంత్రాంగానికి సూచించడంతో ఆ దిశగా సన్నద్ధమవుతున్నారు. కొండలు, గుట్టలు అటవీ భూములు కాకుండా ఇతర స్థలాలను ఎంపిక చేయాలని ఆదేశించింది. ఒక వేళ ప్రభుత్వ భూములు అందుబాటులో లేకుంటే ప్రైవేట్ భూములను గుర్తించి వాటి బహిరంగ మార్కెట్ ధర, ప్రభుత్వ ధరలను సూచించింది. ఈ నేపథ్యంలోనే శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రభుత్వ ,అసైన్డ్ భూముల సమాచారం సేకరణపై రెవెన్యూ యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఇలా..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల గుర్తింపుపై సమాచారాన్ని సేకరిస్తున్న రెవెన్యూ యంత్రాంగం 12 మండలాల పరిధిలో 5,195 ఎకరాల ఉన్నట్లు రెవెన్యూ శాఖ లెక్క తేలినట్లు తెలుస్తోంది. మేడ్చల్ జిల్లాలోని బాలానగర్ మండలంలో 700 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425, మేడిపలి మండలంలో 900, ఘట్‌కేసర్ మండలంలో 500, కాప్రా మండలంలో 400, కీసర మండలంలో 417, కుత్బుల్లాపూర్ మండలంలో 600, బాచుపల్లి మండలంలో 360, ఉప్పల్ మండలంలో 333.13, మల్కాజిగిరి మండలంలో 113.06, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు సమాచారం. అయితే వీటిలో దాదాపు 40 శాతానికి పైగా అన్యాక్రాంతం కాగా, రెవెన్యూ శాఖ సమగ్ర సర్వేపై దృష్టి పెడుతోంది. 2004 వరకు ప్రభుత్వ భూములను ఎంతమందికి అసైన్డ్ చేశారనే విషయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. మేడ్చల్ జిల్లాలో 116 గ్రామాలకు చెందిన 8,230 మంది నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ కుటుంబాలకు 11,384 ఎకరాల ప్రభుత్వ భూములను వ్యవసాయం (పంట సాగు), ఇళ్ల స్థలాల కోసం అసైన్డ్ చేశారని గుర్తించిన అధికార యంత్రాంగం మండలాల వారీగా వివరాలపై ఆరా తీస్తోంది. ఘట్‌కేసర్ మండలంలోని 17 గ్రామాల్లో 1,610 ఎకరాలు, శామీర్‌పేట మండలంలోని 30 గ్రామాల్లో 1,451, కీసర మండలం 16 గ్రామాల్లో 1,500, మేడ్చల్ మండలం 29 గ్రామాల్లో 4,400, ఉప్పల్ మండలం 6 రెవెన్యూ గ్రామాల్లో 286, కుత్బుల్లాపూర్ మండలం 18 గ్రామాల్లో 855 ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నట్లుగా రెవెన్యూ శాఖ పేర్కొంటోంది. వీటికి సంబంధించి నోటరీ క్రయ విక్రయాలు చాలా మేరకు జరగగా, అనేక సంస్థలు వెలిశాయి. అలాగే వందలాది ఎకరాల భూములు కూడా అన్యాక్రాంతమైనట్లు గుర్తించిన యంత్రాంగం ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా చర్యలకు సిద్ధమవుతోందని తెలుస్తోంది.

స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయం



పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

శామీర్‌పేట్: ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారం అభినందనీయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. జవహర్‌నగర్, బాలాజీనగర్, శామీర్‌పేట్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, మహిత ఎన్జీఓ సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్, తరగతుల్లో ఫర్నీచర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంకా కొన్ని పాఠశాలల్లో సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచి పనులతోనే గుర్తింపు



సాక్షి,మేడ్చల్ జిల్లా: విధి నిర్వహణలో చేసిన మంచి పనులే గుర్తింపునిస్తాయని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్పోర్ట్స్ అధికారి గోపాల్‌రావు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాల్‌రావును శాలువా, పూలబొకెతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ జిల్లాల్లో 35 ఏళ్లుగా స్పోర్ట్స్ అధికారిగా గోపాల్‌రావు సుదీర్ఘ ప్రయాణం చేసి తన కెరీర్‌ను విజయవంతంగా ముగించుకుని, తోటి ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖాధికారి వినోద్ కుమార్, జిల్లా మైనార్టీ అధికారి కాంతమ్మ, డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఝాన్సీ రాణి, సివిల్ సప్లై డీఎం సుగుణాబాయి, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ రాంమోహన్, ఏలో శివప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేసి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కులం, స్థానికత, ఆదాయం ఇతర సర్టిఫికెట్లను సకాలంలో తప్పుల్లేకుండా జారీ చేయాలని సూచించారు. మండలంలో మొత్తం 552 దరఖాస్తులు స్వీకరించగా 120 ఆమోదించామని, జిల్లాలో 3,862 దరఖాస్తులు స్వీకరించగా 700 దరఖాస్తులకు ఆమోదం లభించిందని తెలిపారు. విరాసత్, అసైన్డ్ భూములు, కోర్టు కేసులు తదితర అంశాల కారణంగా కొన్ని దరఖాస్తులు తిరస్కరించామని మరోసారి పరిశీలించి సక్రమంగా ఉన్నవాటిని ఆమోదిస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రజిని, నాయబ్ తహసీల్దార్ రాజేందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

‘పింఛన్ విద్రోహ దినం’ విజయవంతం చేయాలి



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్ కలెక్టరేట్‌లో సెప్టెంబర్ 1న ఉదయం11 గంటలకు తలపెట్టిన ‘పింఛన్ విద్రోహ దినం’ కార్యక్రమంలో జిల్లాలోని అధికార, ఉద్యోగ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ మేడ్చల్‌–మల్కాజ్‌గిరి జిల్లా చైర్మన్ రవిప్రకాశ్, జనరల్ సెక్రటరీ జి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి తమ డిమాండ్ల వినతి పత్రాన్ని అందజేశారు. గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు , ఉద్యోగులు, అధికారులు అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్, ఆర్టీసీ కళాభవన్ (కల్యాణ మండపం)లో‘పాత పెన్షన్ సాధన పోరాట సభలో పాల్గొనాలని కోరారు. అలాగే ‘పింఛన్ విద్రోహ దినం’ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా నాయకులు కురుమూతి, సుధాకర్, రవీందర్, భరత్ కుమార్, శేషాసాయి గిరికాంత్, రవిచంద్రన్, అశ్విని, కలెక్టర్ యూనిట్ నాయకులు కార్తీక్, కిశోర్, లింగాల అక్షయ్, మేడ్చల్ యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాస్, మల్కాజ్‌గిరి యూనిట్ కార్యదర్శి అరుణ, కోశాధికారి సత్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలి

కీసర: నాగారం నుంచి యమ్నంపేట వరకు చేపట్టిన ప్రధాన రోడ్డు అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతూ మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సెక్రటేరియట్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులను శుక్రవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, ఇప్పటివరకు ఐదుగురు మృత్యువాత పడ్డారని, త్వరగా పూర్తయ్యేలా చూడాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నక్క కిశోర్‌గౌడ్, రామక్కపేట రవీందర్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కీసర: బోగారంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు పార్టీల నాయకులు నాగారం మున్సిపల్ కమిషనర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోగారం గ్రామం నాగారం మున్సిపల్‌లో విలీనమైనప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడంలేదని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధాన రోడ్డులో హైమాస్ట్ లైట్లు వెలగడం లేదని, సీసీ రోడ్డు అధ్వానంగా మారిందని, వీధి కుక్కల బెడద పరిష్కరించాలని వారు వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సుంకరి వెంకటేశ్, గన్నెరుల సత్యనారాయణ, కొలిచెలిమి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం మెషిన్‌లో స్పీకర్ చోరీ

పోచారం: ఏటీఎం మెషిన్‌లోని స్పీకర్ చోరీకి గురైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అన్నోజిగూడలోని సౌత్ ఇండియన్ బ్యాంక్‌కు చెందిన ఏటీఎం మెషిన్‌లోని స్పీకర్‌ను ఈనెల 24న అర్ధరాత్రి సమయంలో దొంగలు అపహరించారు. బ్యాంకు ఉన్నతాధికారుల సూచన మేరకు బ్రాంచి మేనేజర్ అనూప్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేషనల్ ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కీసర: నేషనల్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాచుపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్‌–17 పోటీల్లో కీసర బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 11 మంది హాజరు కాగా సురేశ్ వెండి పతకం, రాణి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు, జాయింట్ సెక్రటరీ తిరుపతి, కీసర గురుకుల స్కూల్ ప్రిన్సిపాల్ రాములుగౌడ్ విద్యార్థులను అభినందించారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

● మేడ్చల్‌–మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి ● శామీర్‌పేట్ చెరువు వద్ద ఏర్పాట్ల పరిశీలన



శామీర్‌పేట్ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి



వినాయకసాగర్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట్: నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. అడిషినల్ డిసిపి పురుషోత్తంతో కలిసి శామీర్‌పేట్ చెరువు వద్ద ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వాహనాల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా రోడ్లు నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ప్రజలు చెరువు వద్దకు వెళ్లకుండా బారీకేడ్లు, రెండు పాయింట్లలో క్రేన్లు, లైటింగ్, శానిటేషన్, వైద్య సదుపాయం, తాగునీరు, టాయిలెట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. చెరువు పరిసరాల్లో చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి, శామీర్ పేట్ తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఆర్ అండ్‌బీ అధికారి శ్రీనివాస్‌మూర్తి, శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎస్‌ఐ శశివర్ధన్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, విద్యుత్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ఘట్‌కేసర్: ఎదులాబాద్ వినాయకసాగర్ (శ్రీ లక్ష్మీనారాయణ చెరువు) వద్ద నిమజ్జన ఏర్పాట్లను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా బారీకేడ్లు, విద్యుత్ దీపాలు, పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేసి నిమజ్జనం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రాజేందర్, ఎస్సై శేఖర్, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలో నిమజ్జనానికి భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. అర్హులు, అనర్హులు, ఇంటి ఆమోదం, స్థితిగతులపై చర్చించారు. అనంతరం వినాయక నిమజ్జన ఏర్పాట్లపై సిబ్బందితో సమీక్షించారు. సుతారిగూడ చెరువు, నారాయణ చెరువులో గుర్రెపు డెక్క తొలగింపు పనులు పరిశీలించి నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, అధికారులు, మాజీ కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ చెరువు వద్ద..

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని వినాయకసాగర్ లక్ష్మీనారాయణ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను రాచకొండ సీపీ సుధీర్‌బాబు స్థానిక అధికారులతో కలిసి శుక్రవారం రాత్రి పరిశీలించారు. విద్యుత్ లైట్లు, బారీకేడ్లు, ట్రాఫిక్ ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భువనగిరి డీసీపీ ఆకాంక్ష యాదవ్, ఏసీపీ రాహుల్‌రెడ్డి, ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీ ఎంవీ శ్రీనివాస్, స్థానిక మున్సిపల్ కమిషనర్ రాజేశ్, స్థానిక ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్సై శేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆలోచన విధానమే కీలకం



కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: యువతరానికి వారి ఆలోచన విధానమే కీలకమని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఫార్మసీ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు జేఎన్టీయూహెచ్ ఫార్మాస్యూటికల్స్ సైన్సెస్ ప్రిన్సిపాల్ సునీతారెడ్డి పాల్గొని విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేసి ప్రసంగించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి గ్రూప్స్ డైరెక్టర్ భద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ తుల్జా రాణి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సీఆర్‌పీఎఫ్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అపర్ణ

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ సీఆర్‌పీఎఫ్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. దీంతో క్యాంపస్ ఆవరణలో ప్రిన్సిపాల్ అపర్ణ ఆధ్వర్యంలో శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సీఆర్‌పీఎఫ్ స్కూల్ క్రమశిక్షణకు నిలయంగా నిలుస్తోందన్నారు. తమ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడంలో ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి రాజశేఖర్ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హరిశంకర్, ఆశాజీకుమార్, కిశోర్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, ఈశ్వర్‌రావు, వెంకటరాజు, గోపాలకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న శ్రీకాంత్‌యాదవ్

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని పొన్నాల గ్రామానికి చెందిన రాగిరి బాలనర్సింహకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.42,500 ఆర్థిక సాయం మంజూరైంది. కాగాద సంబంధిత చెక్కును జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యులు, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి శుక్రవారం లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రమేశ్ పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

జవహర్‌నగర్: నిరుపేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ సహకారంతో జవహర్‌నగర్‌కు చెందిన పలువురికి మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను శుక్రవారం ఆయన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అనంతలక్ష్మి, మాట్ల వినయ్‌కుమార్, విజయ, సరిత, అశోక్, రాజుయాదవ్, అనిల్ ముదిరాజ్, ధనమ్మ, సుమన్, సాయికృష్ణ, మేఘమాల, అజయ్, సోమేష్‌చారి, అనిల్, అరుణ, సూరమ్మ, దుర్గేశ్, వినోద్, క్రాంతి కళాబృందం వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి



సాక్షి,మేడ్చల్ జిల్లా : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు ధ్యాన్ చంద్ చిత్రటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, జిల్లా మైనార్టీ అధికారి కాంతమ్మ, డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఝాన్సీరాణి, సివిల్ సప్లై డీఎం సుగుణాబాయి, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ రాంమోహన్, ఏలో శివప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘అనర్హులకే ఇందిరమ్మ ఇండ్లు’



మాట్లాడుతున్న పట్టణ బీజేపీ నాయకులు

మేడ్చల్: కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లను అర్హుల కంటే అనర్హులకే ఎక్కువగా ఇస్తోందని మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజ ఆరోపించారు. పట్టణ నాయకులతో కలిసి గురువారం ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ కార్యక్రమంగా నిర్వహించారని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అర్హత ఉండి ఇండ్లు మంజూరు కానీ వారితో త్వరలోనే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ నాయకులు ప్రేమ్‌దాస్, వంశీవంజరి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.